క్లుప్తంగా

బాధిత కుటుంబానికి బాసట



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న వాంబేకాలనీకి చెందిన పులకరం శివకుమార్ కుటుంబానికి నున్న రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై సేనాపతి శ్రీనివాస్ బాసటగా నిలిచారు. వారి కుటుంబ స్థితిని తెలుసుకున్న ఆయన వారికి నెలవారీ సరుకులు, 50 కేజీల బియ్యం, రూ.5 వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ నిరుపేద కుటుంబానికి ఎస్సై చేసిన సాయాన్ని తెలుసుకున్న నార్త్‌జోన్ ఏసీపీ రవికాంత్, సీఐ కె.శ్రీనివాస్ ఆయన్ను అభినందించారు.

దాతల సహకారం మరువలేనిది



మధురానగర్(విజయవాడసెంట్రల్): దాతల సహ కారం మరువలేనిదని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్ తెలిపారు. దుర్గాపురానికి చెందిన డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సేవాకార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు శనివారం సాయంత్రం సత్కారం జరిగింది. వసంతకుమార్ మాట్లాడుతూ వాంబేకాలనీకు చెందిన మాతృదేవోభవ వృద్ధాశ్రమానికి రూ. 35వేల వ్యయంతో షెడ్డును నిర్మించి అన్నదానానికి సహకరించిన దాతలను సత్కరించుకోవటం ఆనందంగా ఉందన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురునాయుడు మాట్లాడుతూ సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు, దాతలను సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కె.రాము, ఉపాధ్యక్షులు కె. వరప్రసాద్, కోశాధికారి ఏడుకొండలు, బీసీ సంక్షేమ సంఘం నాయకుల వీరంకి గోకర్ణేశ్వరరావు, మండ రాము, ఫణి మిత్ర బృందం తదితరులు పాల్గొన్నారు.

అప్సర థియేటర్‌లో సీట్లు దగ్ధం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాన్స్ అత్యుత్సాహంతో థియేటర్‌లో సీట్లు దగ్ధమయ్యాయి. సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా విజయవాడ అప్సర థియేటర్‌లో సింహాద్రి సినిమా ప్రదర్శించారు. ఫ్యాన్స్ క్రాకర్స్ కాల్చడంతో నిప్పు రవ్వలు పడి సీట్లు దగ్ధమయ్యాయి. ఆ సమయంలో థియేటర్‌లో గందరగోళం నెలకొంది. థియేటర్‌లో మంటలు వ్యాప్తి చెందాయన్న సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అప్రమత్తమ య్యారు. మంటలను ఆర్పివేశారు. థియేటర్‌లో మిగిలిన షోలు ప్రదర్శించకుండా నిలిపివేశారు.

నగరంలో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీస్ అధికారులు వారి సిబ్బందితో కలిసి శనివారం సాయంత్రం ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలు చేశారు.

బాస్కెట్‌బాల్ విజేత కృష్ణా

పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు మాంటిస్సోరీలో నాలుగు రోజులుగా నిర్వహించిన కవురు శ్రీనివాస్ కప్ రాష్ట్ర స్థాయి బాలుర, బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు ఉత్కంఠగా సాగాయి. ఫైనల్‌లో తూర్పుగోదావరి జిల్లా బాలికల జట్టు కృష్ణా జిల్లా బాలికల జట్టుపై 55/43 పాయింట్ల తేడాతో విజయం సాధించి విజేతగా నిలిచింది. కృష్ణా జిల్లా బాలుర జట్టు తూర్పుగోదావరి జట్టుపై 62/40 పాయింట్ల తేడాతో విజయం సాధించి కవురు శ్రీనివాస్ కప్ ట్రోఫీని గెలుచుకున్నారు. విజేతలకు శుక్రవారం రాత్రి ఉల్లంపర్రు క్రీడా ప్రాంగణంలో బహుమతులు అందజేశారు. ఎకార్యక్రమంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టి.చెంగల్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి, కోశాధికారి బి.రేవతి, జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంతోషమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



గడప గడపకు మన ప్రభుత్వంలోసమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలోని పేదలు సంతోషంగా ఉండటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' శనివారం 24వ డివిజన్‌లోని 91వ వార్డు సచివాలయం పరిధిలో బారిస్టర్ వీధి, బోయపాటి వారి వీధుల్లో కొనసాగింది. కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం కంటే, ఈ ప్రభుత్వంలో తమకు వందశాతం మేలు చేకూరినట్లు ప్రజలు చెప్పడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీకార్డు ఉండేలా సచివాలయ హెల్త్ సెక్రటరీ చొరవ చూపాలన్నారు.

చంద్రబాబుది పక్కచూపు

నలభై ఏళ్ల ఇండస్ట్రీ, 14 ఏళ్లు ముఖ్యమంత్రి అని చెప్పుకునే చంద్రబాబు పేద వర్గాల కోసం ఒక్క గజమైనా జాగా ఇచ్చారా అని మల్లాది విష్ణు ప్రశ్నించారు. సింగపూర్, మలేషియా అంటూ దాంబికాలు తప్ప ఆంధ్రను పట్టించుకోలేదని చంద్రబాబుది పక్కచూపని ఎద్దేవా చేశారు. ఈసారి టీడీపీకి శాశ్వత సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం

పేదలు, మధ్యతరగతి వర్గాలు, ఉద్యోగస్తుల ఫ్రెండ్లీ ప్రభుత్వం ప్రస్తుతం రాష్ట్రంలో పాలన సాగిస్తున్నట్లు మల్లాది విష్ణు పేర్కొన్నారు. హౌస్ ఫర్ ఆల్ నినాదంలో 31 లక్షల మంది పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేస్తే టీడీపీ విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. తమ నియోజకవర్గానికి చెందిన 5642 మందికి సీఆర్‌డీఏ పరిధిలో ఇళ్ల స్థలాలు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంటహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, చంటి, రామిరెడ్డి, చింతకాయల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు భూమి పూజ

24వ డివిజన్‌లోని తరిమెల నాగిరెడ్డి వీధిలో రూ.17 లక్షల వ్యయ అంచనాతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు భూమిపూజ నిర్వహించారు. ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పేదల స్థలాలను.. 'సమాధులు'తో పోల్చడం సరికాదు

- డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ
- చంద్రబాబు వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ నిరసన



పైపులరోడ్డు సెంటర్‌లో నిరసన తెలుపుతున్న డెప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న ఇంటి స్థలాలను ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు సమాధులతో పోల్చడం సిగ్గుచేటని, ఆయన ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ డిమాండ్ చేశారు. జగనన్న కాలనీలో నిరుపేదలకు ఇచ్చిన స్థలాలు ప్రజలు చనిపోయిన తర్వాత పూడ్చడానికి తప్ప దేనికి పనికిరావని చంద్రబాబునాయుడు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో సింగ్‌నగర్ పైపులరోడ్డు సెంటర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం నిరసన కార్యక్రమం చేశారు. ఆమె మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు పేదల కష్టాలు పట్టించుకోని చంద్రబాబు నేడు వారి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. సెంటు స్థలంలో నిరుపేదలు ఇళ్లు కట్టుకొని జీవిస్తుంటే చంద్రబాబు ఓర్వలేకపోతున్నాడని, చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల ఇళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం చదువులు, అమ్మఒడి పథకాలు ఇలా అన్నిటిపై విషం కక్కుతూనే ఉన్నాడని మండిపడ్డారు. గత ఎన్నికల్లో మహిళల ఆగ్రహాన్ని చంద్రబాబు సరిగా చూడలేదని ఈ సారి ఎన్నికల్లో ఆ పార్టీకి అడ్రస్ లేకుండా అన్నివర్గాల ప్రజలు తరిమే రోజు వస్తుందని హెచ్చరించారు. కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మ, కొండాయిగుంట మల్లీశ్వరి, ఇసరపు దేవి, ఎండీ షాహీనాసుల్తానా, బీహెచ్‌ఎస్వీ జానారెడ్డి, కొంగింతల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు బందెల కిరణ్‌రాజు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు పిల్లి కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, ఎండీ హఫీజుల్లా, ఇసరపు రాజు, అలంపూరు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో 'నేను స్టూడెంట్ సర్' సందడి



సమావేశంలో మాట్లాడుతున్న హీరో బెల్లంకొండ గణేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): 'నేను స్టూడెంట్ సర్' చిత్ర యూనిట్ నగరంలో సందడి చేసింది. ఒక యువకుడు తన సెల్ ఫోన్ పోగొట్టుకున్న నేపథ్యంలో ఎదురయ్యే పరిణామాలను ఈ చిత్రంలో దర్శకుడు చాలా చక్కగా చిత్రీకరించారని హీరో బెల్లంకొండ గణేష్ తెలిపారు. జూన్ 2న ఈ చిత్రం రిలీజ్ కానుందని ఆయన పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని సదరన్ హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో హీరో బెల్లంకొండ గణేష్ మాట్లాడుతూ 'నేను స్టూడెంట్ సర్' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాన్ని విజయవాడ నగరం నుంచి ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పది రోజులపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో చిత్ర షూటింగ్ కూడా జరిగిందన్నారు. తనకు హీరోలు వెంకటేష్ జూనియర్ ఎన్టీఆర్ అంటే ఎంతో ఇష్టమని వారి చిత్రాలను ఎన్నో చూశానని, వారిని ఆదర్శంగా తీసుకొని సినిమా ఇండస్ట్రీకి వచ్చినట్లు పేర్కొన్నారు. తనకు దర్శకుడు రాజమౌళి అంటే ఎంతో ఇష్టమని ఆయన తీసే చిత్రంలో ఒక క్యారెక్టర్ అయినా వేయాలని ఆశగా ఉందని చెప్పారు. దర్శకుడు రాఖీ ఉప్పలపాటి మాట్లా డుతూ బెల్లంకొండ గణేష్ నటన ఈ సినిమాకి హైలెట్‌గా ఉంటుందని తెలిపారు. సమావేశంలో నిర్మాత నాంది సతీష్ , జబర్దస్త్ రాంప్రసాద్, కమెడీయన్ రవితేజ పాల్గొన్నారు.

ఇ-వేస్ట్‌ను సేకరించడం అభినందనీయం



సింగ్‌నగర్‌లో..



ఎంజీరోడ్డులో ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దేవి



ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో కార్పొరేటర్ జానారెడ్డి, ఏసీపీ అనసూయ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): పర్యావరణానికి హాని కలగకుండా అత్యంత జాగ్రత్తగా ఇ-వేస్ట్‌ను సేకరించడం అభినందనీయమని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం బస్టాప్ వద్ద నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్) సెంటర్‌ను శనివారం 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్లా స్టిక్ వినియోగం నానాటికి పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో పాత వస్తువులు రీ సైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నా రు. సర్కిల్ 2 పరిధిలో 21 సెంటర్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సృజన, ఏఎంటహెచ్ రామకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): 61వ డివిజన్‌లో ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి శనివారం ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, వార్డ్ సచివాలయ అధికారులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఉమ్మడి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి మేలు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వం చేపట్టిన'ఆర్ఆర్ఆర్' సెంటర్ల ఏర్పాటుతో పర్యావరణానికి మేలు జరుగుతుందని 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి అన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన 57వ డివిజన్ న్యూఆర్ఆర్‌పేటలో ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్(రెడ్యూస్- రీయూజ్- రీసైకిల్) సెంటర్‌ను శనివారం ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి, పాత వస్తువులు రీసైక్లింగ్ చేయడానికి ఈ సెంటర్లు దోహదపడతాయన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కర్నాటి వెంకట దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఇసరపు రాజు, వార్డ్ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. 59వ డివిజన్ సింగ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా ప్రారంభించారు. పనికిరాని ప్లాస్టిక్ వస్తువులు, పాత వస్త్రాలు, పుస్తకాలను తెచ్చి ఈ సెంటర్లలో ఇవ్వాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వింజమూరి వందనం బాబు, వార్డ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక రామకృష్ణాపురం శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వ్యర్థాలను సేకరించడానికి ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ (రెడ్యూస్, రీ యూజ్, రీసైక్లింగ్) సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ జానారెడ్డి ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను ఏసీపీ అనసూయతో కలిసి ప్రారంభించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

31వ డివిజన్‌లో..

31వ డివిజన్ శ్రీనగర్ కాలనీ వార్డు సచివాలయంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్‌ను కార్పొరేటర్ పెనుమత్స శిరీష ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభు శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం స్కూళ్లు, కళాశాలలకు సెలవులు కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాలను ఈఓ నాగినేని భవాని, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు పర్యవేక్షించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

26 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం ఆలయ అర్చకులు అంగలూరి రంగాచార్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వేంకటేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త అంగలూరి పద్మావతి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 28 వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 26వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు సుప్రభాతసేవతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు, విశేషంగా లోకకల్యాణార్థం హోమాలు ఏర్పాటు చేశామన్నారు. 28వ తేదీ ఆదివారం శ్రీదేవి భూదేవి శిలాబింబముల ప్రతిష్ఠ, స్వామివారి కల్యాణం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు.

గుడ్ షఫర్డ్ సంస్థ, ఆర్ఆర్ ఫౌండేషన్ పేరుతో మోసం

ఎన్‌సీబీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌మాస్క్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో గుడ్ షఫర్డ్ సంస్థ, ఆర్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత బోధకులు, పాస్టర్లను మోసం చేశారని నేషనల్ క్రిస్టియన్ బోర్డు జాతీయ అధ్యక్షులు డాక్టర్ జాన్‌మాస్క్ ఆరోపించారు. సింగ్‌నగర్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ పాస్టర్లు కొంతమొత్తం డబ్బులు పెట్టుబడి పెడితే భారీ మొత్తంలో ఇస్తామని చెప్పి కేవలం పాస్టర్లను మాత్రమే టార్గెట్ చేసి భారీ మోసానికి ఆ సంస్థల నిర్వాహకులు పాల్పడ్డారని ఆరోపించారు. తమ వద్ద డిపాజిట్ చేస్తే తమిళనాడులో ఒక్కొక్కరికి ఐదు సెంట్ల స్థలం ఇస్తామని ఆశచూపి కొంతమంది నుంచి ఐదు లక్షల రూపాయలు కూడా వసూలు చేశారని, మరికొంత మందికి డ్వాక్రా మహిళా సంఘాలకు కోటి రూపాయల వరకూ రుణాలు ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు వివరించారు. నిరుపేద పాస్టర్లు, క్రైస్తవ పెద్దలను మోసం చేసిన సదరు సంస్థల నిర్వాహకులపై డీజీపీ చర్యలు తీసుకోవాలని కోరారు. పలు సంఘాల పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడు



హనుమత్ వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు



హాజరైన ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెల్లంపల్లి శ్రీనివాస్



సంగీత కళాశాలలో సాంస్కృతిక ప్రదర్శన

విజయవాడ కల్చరల్: సర్వమంగళ స్వరూపుడు హనుమంతుడని ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. మల్లాది వెంకట సుబ్బారావు సుందరమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన దుర్గాపురంలోని సంగీత కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే హనుమత్ వైభవం అంశం ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ సర్వకాల సర్వావస్థలో హనుమంతుడు రామనామం జపించడమే విజయకారణమని నమ్మి మహిమ తెలుసుకున్నాడని తెలిపారు. హనుమంతుని పూజిస్తే రాముని పూజించినట్లేనని తెలిపారు. సర్వదేవతల శక్తులు హనుమంతునిలో ధారపోయాలని చతుర్ముఖ బ్రహ్మ అనుకున్నాడని వివరించారు. ధర్మానికి వ్యతిరేకంగా ఉండేవారిని హనుమంతుడు శిక్షిస్తాడన్నారు. హనుమ చెంతకు ఏ ఆయుధం చేరదని ఏ శక్తి అడ్డుకోలేదని తెలిపారు. ప్రజలు ఆధ్యాత్మికమైన మార్గం అనుసరించాలని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకుల కృషిని అభినందించారు. ప్రసంగం ప్రారంభంలో వేదపండితులు చాగంటి కోటేశ్వరరావును పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ట్రస్ట్ చైర్మన్ మల్లాది విష్ణు మాట్లాడుతూ ఏటా వైశాఖ మాసంలో ట్రస్ట్ ద్వారా ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గతేడాది చాగంటితో దేవీవైభవం ప్రసంగం ఏర్పాటు చేశామని ముక్కోటి దేవతలు ఆరాధించేంది హనుమంతుడినే అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ అవుతు శైలజ రెడ్డి, దుర్గామలేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, స్థానిక కార్పొరేటర్లు కొండాయిగుంట మల్లీశ్వరి, శర్వాణీమూర్తితో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా భాగవతుల వెంకట్రామ శర్మ బృందం పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైజ్ఞానిక స్పృహతో సామాజిక అవగాహన



మాట్లాడుతున్న కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దేవరాజు మహారాజు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైజ్ఞానిక స్పృహ ఉన్నవారే సామాజిక అవగాహనతో సాగుతారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దేవరాజు మహారాజు అన్నారు. మానవాళి ప్రయోజనాల కోసం సాగించే పరిశోధనలు విస్తృతం కావాలన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రం ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎంపీ పి.మధు అధ్యక్షతన నిత్య జీవితంలో వైజ్ఞానిక స్పృహ అనే అంశంపై సభ నిర్వహించారు. దేవరాజు మాట్లాడుతూ శాస్త్రీయ పరిశోధనలకు వర్తమానంలో ప్రాధాన్యం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ల సాయంతో ఉన్నత విద్యా సంస్థలు నడుపుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పడం విచారకరమన్నారు. దేవాలయాల్లో కూడా సైన్స్ ఆధారంగానే కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని కూడా తప్పుబట్టిన సమాజం ఒకనాడు ఉండేదన్నారు. కార్పొరేట్ విద్య కారణంగా పిల్లల్లో ప్రశ్నించే తత్వం తగ్గుతోందన్నారు. నిచ్చెనమెట్ల వ్యవస్థ కొనసాగుతున్న దేశంలో వైజ్ఞానిక స్పృహ అవసరం ఎక్కువగా ఉందన్నారు. కర్ణాటక ఎన్నికల్లో మానవత్వాన్ని తుంచేసే శక్తులపై ప్రజలను అప్రమత్తం చేసిన ప్రజాసంఘాల పాత్ర గుర్తించాలన్నారు. సామూహిక చైతన్యం పెంచడం ప్రజా సంఘాలుగా ఆలోచించాలన్నారు. అమరావతి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఎస్.పి.రామరాజు, ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ, ఇన్‌చార్జి బి.ఆర్.తులసీరావు, టి.క్రాంతికిరణ్, యు.వి. రామరాజు, పాగోలు రాజు, కె.స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

జూన్ 24, 25 తేదీల్లో కథా వర్క్‌షాప్

విజయవాడ కల్చరల్: సమన్విత సాంస్కృతిక సేవా సంస్థ, సేఫ్, కామ్రేడ్ పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం ఆధ్వర్యంలో జూన్ 24, 25 తేదీల్లో కృష్ణా జిల్లా చినముక్తేవిలో కథా వర్క్‌షాప్ నిర్వహిస్తునట్లు సమన్విత సేవాసంస్థ బాధ్యులు శాంతిశ్రీ, శమంతకమణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017లో సమన్విత సంస్థను ప్రారంభించామని నాటి నుంచి ఏటా సాహిత్య సమావేశాలు, శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాది కథా రచయిత మహ్మద్ ఖదీర్ బాబు ఆధ్వర్యంలో కథా వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని వయో బేధం లేకుండా శిబిరంలో ఎవరైనా పాల్గొనవచ్చని వివరించారు. వివరాలకు శాంతిశ్రీ 833 381 8985, శమంతకమణి 94919 62648 ,ఉషారాణి 94928 79210 నంబర్లలో జూన్ 10వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

వైఎస్సార్ కాలనీలో వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో గొల్లపూడి 10వ సెగ్మెంట్ పరిధిలోని పలు బ్లాకులలో పగిలిపోయి పెద్ద ఎత్తున లీకవుతున్న సిన్‌టెక్స్ వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు ప్రారంభించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదో సెగ్మెంట్ పరిధిలో 207, 219, 227 బ్లాకులపై ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌లు పగిలాయి. దీంతో తాగునీటికి ప్రజలు పడుతున్న ఇబ్బందులను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లామని స్థానిక ఎంపీటీసీ షేక్ సైదాబీ, ఆమె భర్త హిమవలి తెలిపారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన సొంత ఖర్చులతో ఆయా వాటర్ ట్యాంక్‌లకు శనివారం మరమ్మతులు చేయిస్తున్నారని వారు వివరించారు. వాటర్ ట్యాంక్‌లకు మరమ్మతులు చేయించి వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టిన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తదితరులు తెలిపారు.

సిరివెన్నెలకు స్వరాంజలి



సిరివెన్నెల సీతారామశాస్త్రి సినీ జీవిత విశేషాలు వివరిస్తున్న ఆశయ్య, రసూల్ బాబు తదితరులు

విజయవాడ కల్చరల్: సినీ గేయ రచయిత, కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతి సందర్భంగా మోహన్ కృష్ణా ఆర్ట్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సిరివెన్నెలకు అమర గాయకులకు స్వరాంజలి, తెలుగు సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆ సంస్థ కార్యదర్శి బి.ఆశయ్య సిరివెన్నెల సీతారామ శాస్త్రి సినీరంగ సేవలను వివరించారు. సినీ సాహిత్యంలో సిరివెన్నెల కురిపించిన రచయిత సీతారామశాస్త్రి అని తెలిపారు. తెలుగు సినిమాలకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన కవి సిరివెన్నెలగా అభివర్ణించారు. మోహన్ కృష్ణా ఆర్ట్స్ అధ్యక్షురాలు బి.లక్ష్మీబాయి, కోశాధికారి మోహన్ కృష్ణానాయక్, తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు. ఆశయ్య ఆధ్వర్యంలో కృష్ణకుమారి, సువర్ణలక్ష్మి, శివనాగలక్ష్మి రూపశ్రీ, కృష్ణ సింధూ, రైల్వే శ్రీనివాస్. షేక్ రసూల్‌బాబు. రామశంకరరావు పలు చిత్ర గీతాలను ఆలపించారు.